‘అందాల పోటీల నిర్వహణ సరికాదు’



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా హైదరాబాద్‌లో జరుగుతున్న అందాల పోటీలు విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ దేశానికి అండగా నిలబడాలని, సైనికులకు, వారి కుటుంబాలకు మేమున్నామన్న ధైర్యాన్ని కల్పించేలా చూడాలన్నారు. ఈ పోటీలు నిర్వహనపై శ్రద్ధ చూపకుండా, పరిస్థితులు అన్వేషించుకుని ముందుకు వెళ్లాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

నాలాల్లో చెత్త తొలగింపు పనుల పరిశీలన

మోతీనగర్: డివిజన్ పరిధిలోని కబీర్‌నగర్‌లో చెత్తాచెదారం తొలగింపు పనులను మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్ ఏఈ వర్షిణితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలగించిన చెత్తను వెంటనే తరలించాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎర్ర స్వామి, నాయకులు రమేశ్ నాయుడు, సతీశ్ చారి, బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఉంటున్న విదేశీయులను పంపించండి



పోలీసులకు వినతిపత్రం ఇస్తున్న కాంతారావు, రాజేశ్వరరావు, నాయకులు

కూకట్‌పల్లి: నియోజకవర్గంలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, మయన్మార్‌లోని రోహింగ్యాలు అక్రమంగా నివసిస్తూ, నకిలీ పత్రాలతో మోసాలకు పాల్పడుతున్నారని తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ కూకట్‌పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు నాయకత్వంలో బీజేపీ ప్రతినిధులు కూకట్‌పల్లి సీఐకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి పార్టీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ..ఉగ్రవాదం దేశ భద్రత, ప్రజల శాంతి, అభివృద్ధికి ఇది పెద్ద అడ్డంకి మారిందన్నారు. మనం ఐక్యంగా నిలబడి ఉగ్రవాదాన్ని శాసించి, సమాజాన్ని శాంతియుతంగా తీర్చిదిద్దాలని కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తూము శైలేష్ కుమార్, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి విజయభవానీ, నియోజకవర్గంలోని డివిజన్ అధ్యక్షుడు, బీజేపీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పార్కు నిర్వహణ గాలికి..!

- అధ్వానంగా ఆస్‌బెస్టాస్ కాలనీ పార్కు
- ఖాళీ స్థలంలో ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్
- రాత్రయితే అసాంఘిక కార్యకలపాలకు అడ్డా
- లైట్లు, క్రీడా సామాగ్రి అపహరణ
- ఇబ్బందుల్లో స్థానికులు



పార్కు ఖాళీ స్థలంలో నిలిపిన వాహనాలు

అల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్‌లోని ఆస్‌బెస్టాస్ కాలనీ పార్కు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. పార్కు స్థలాన్ని ఖాళీగా వదిలేయడంతో కొందరు తమ వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు. మరోవైపు రాత్రి అయితే చాలు మందుబాబులు, గంజాయి సేవించేవారు ఇక్కడే తిష్ట వేస్తున్నారు. దీంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. సనత్‌నగర్‌లోని బిర్లా కంపెనీ కార్మికుల కోసం సుమారు 40 ఏళ్ల క్రితం ఆస్‌బెస్టాస్ కాలనీని ఏర్పాటు చేశారు. కాలనీ అభివృద్ధిలో భాగంగా పార్కు కోసం రెండెకరాల స్థలాన్ని కేటాయించి జీహెచ్ఎంసీకి అప్పగించారు. అయినా వారు పట్టించుకోకపోవడంతో క్రీడా స్థలంగా ఉపయోగించుకునేందుకు వదిలివేశారు. 20 ఏళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే పార్కులో షటిల్ కోర్టు కోసం లక్షల రూపాయల నిధులు వెచ్చించి లైట్లు, క్రీడా సామగ్రి ఏర్పాటు చేయించి కోచ్‌ను నియమించి క్రీడాకారులను ప్రోత్సహించారు. మండల, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అయితే తర్వాత నిర్వహణను గాలికి వదిలివేయడంతో లైట్లు, క్రీడా సామాగ్రిని ఎత్తుకెళ్లారు. పార్కును అభివృద్ధి చేయాలని పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆస్‌బెస్టాస్ కాలనీలోని పార్కు స్థలంలో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని వారు కోరుతున్నారు.

సత్వరమే అభివృద్ధి చేయాలి..



ఆస్‌బెస్టాస్ కాలనీ పార్కు స్థలాలు ఖాళీగా ఉండడంతో మందుబాబులు, పోకిరీలకు అడ్డాగా మారుతున్నాయి. దీనివలన స్థానికులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పార్కును ప్రణాళికతో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. పార్కులో ఓపెన్ జిమ్, వ్యాయామ పరికరాలు, షటిల్ కోర్టు, చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా తీర్చిదిద్దితే అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది.

– నరేశ్, ఆస్‌బెస్టాస్ కాలనీ అధ్యక్షుడు

నాలాల్లోని చెత్తను వెంటనే తొలగించాలి

మోతీనగర్: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నాలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం పేర్కొన్నారు. లక్ష్మీనగర్ వద్ద ఉన్న శనివారం నాలాను పరిశీలించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాలాకు ఇరువైపులా ఉన్నవారు చెత్తాచెదారాన్ని నాలాలో వేయకుండా ఇంటి వద్దకు వచ్చే ఆటో కార్మికులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో గాయత్రీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు పి. కృష్ణారావు, నాయకులు రవీందర్ రెడ్డి, మహమ్మద్ నూర్‌ఖాన్, రమణాచారి, యోగిరాజు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించొద్దు

‘సాక్షి’ ఎడిటర్ ఇంట్లో సోదాలను ఖండించిన తెలంగాణ జర్నలిస్టుల సంఘం నాయకులు



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న తెలంగాణ జర్నలిస్టుల సంఘం, రాజకీయ పార్టీల నాయకులు

కేపీహెచ్‌కాలనీలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన

కూకట్‌పల్లి: పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ‘సాక్షి’ దినపత్రిక ఎడిటర్ ఆర్. ధనుంజయ్ రెడ్డి ఇంట్లో సోదాలు చేయడాన్ని తెలంగాణ జర్నలిస్టుల సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు కేపీహెచ్‌బీ కాలనీలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని, అందుకు ఈ అక్రమ సోదాలే నిదర్శమన్నారు. ప్రభుత్వాలే బాధ్యతగా ఉండాలని, కానీ కక్షపూరితంగా దాడి చేయడం సరికాదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ తీరును ప్రజలకు వివరించి జర్నలిస్టులను చైతన్యపరిచి మరో ఉద్యమం చేసి జర్నలిస్టుల సంఘాల హక్కులు కాపాడుకుంటామని ఐజేయూ నాయకుడు, ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు విద్యా వెంకట్ పేర్కొన్నారు. ఇసుక, లిక్కర్, మైనింగ్ స్కాంలు, రైతులకు మద్దతు ధర కల్పించకపోవడం ఇలా ప్రభుత్వ వరుస వైఫల్యాలను ఎండగడుతున్న ‘సాక్షి’ గొంతు నొక్కాలని అక్కడి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ‘సాక్షి’ కూకట్‌పల్లి జోన్ ఇన్‌చార్జి తొట్ల పరమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు అందరికీ ఉందని దానిని నొక్కిపెట్టవద్దని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని, లేకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు ఆర్‌కె. దయాసాగర్, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాణిక్‌రెడ్డి, రాహుల్, నాగరాజు, ప్రవీణ్, జైకుమార్, సాగర్‌రెడ్డి, రాము, నవీన్, రమేశ్, రాకేశ్, కుల్ల రాజు, నరసింహారావు, వెంకటేశ్, రామారావు, హరికృష్ణ, మారుతీసాగర్, పలు పార్టీల నాయకులు ఐస్‌క్రీం వెంకట్ రెడ్డి, శివారెడ్డి, జొన్నల శ్రీనివాస్ రెడ్డి వెంకట స్వామి రెడ్డి, విద్యార్థి సంఘాల నాయకులు దిలీప్, అశోక్‌గౌడ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కూకట్‌పల్లి: ప్రశాంత్‌నగర్‌లోని టాడ్ ఏరోస్పేస్ పాస్టనర్స్ కంపెనీలో ఏడుగురు ఐఎన్‌టీయూసీ కార్మికులు యూనియన్ ఏర్పాటు చేయడంతో యాజమాన్యం వారిపై కక్షపూరితంగా వ్యవహరించి ఐదుగురిని ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి బదిలీ చేసింది. దీనిని నిరసిస్తూ ఐఎన్‌టీయూసీ కార్మికులు రిలే నిరాహారదీక్ష చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీపీసీసీ లేబర్ సెల్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు కాందాడి సుదర్శన్ రెడ్డి, కార్మిక నాయకులు సప్పిడి భాస్కర్, కాస నర్సింహాయాదవ్, ఏడుగురు కార్మికులతో కలిసి దీక్షలో కూర్చొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించి విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే కంపెనీ ఎదుట టీపీసీసీ లేబర్ సెల్, ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ నయీమ్, పాషా, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆపరేషన్ సిందూర్’ విజయవంతం కావాలి



పూజలు చేస్తున్న బుచ్చయ్య, సుధాకర్

మోతీనగర్: ‘ఆపరేషన్ సిందూర్’ విజయవంతం కావాలని కోరుతూ దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మూసాపేట డివిజన్ పాండురంగానగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి చైర్మన్ బాకారం బుచ్చయ్య, కార్యనిర్వాహణాధికారి గుమ్మడిదల సుధాకర్ శనివారం ఆలయంలో పూజలు నిర్వహించి హోమం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం కోసం తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి వీరోచితంగా పోరాడుతున్న జవాన్లకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక కమిటీ సభ్యులు, అర్చకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరాను అరికట్టండి



ఫిరోజ్‌గూడలో పర్యటిస్తున్న కార్పొరేటర్

బాలానగర్: డివిజన్‌లోని ఫిరోజ్‌గూడ, ఆంజనేయ స్వామి ఆలయ వీధిలో తాగునీరు కలుషితమై సరఫరా అవుతోందని స్థానికులు కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన వాటర్ వర్క్స్ సెక్షన్ మేనేజర్ అనిల్‌కుమార్‌తో కలిసి శనివారం పర్యటించారు. సమస్యను పరిశీలించి, తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో దేవులపల్లి కృష్ణమూర్తి, స్థానిక నాయకులు యాదయ్య, ఎడ్ల ప్రభాకర్, ఎడ్ల సత్యనారాయణ, భాషయ్య, రవీందర్ జాక్, గణేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఓల్డ్‌బోయిన్‌పల్లి: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహాయాదవ్ పేర్కొన్నారు. కొన్ని రోజులుగా ముస్లిం బస్తీ బడే మసీదు పక్కన డ్రైనేజీ పొంగిపొర్లడంతో స్థానికంగా దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేయగా స్పందించి శనివారం బస్తీలో పర్యటించారు. జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి నూతన పైపులైన్ మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఎజాజ్, సమీర్, మౌలానా, ఇమ్రాన్, ఖదీర్, ఇలియాస్, ఫయాజ్, చాంద్‌పాషా, జాంగీర్, మూస తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వర స్వామి కల్యాణం



ఓల్డ్‌బోయిన్‌పల్లి: హస్మత్‌పేటలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకుడు మధుసూదన్‌గౌడ్ కుటుంబ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. భక్తులతో పాటు రిటైల్ కూరగాయల మార్కెట్ చైర్మన్ మక్కల సత్యనారాయణ స్వామివారికి అభిషేకం చేశారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ శ్రీనివాస్ రావు

నిజాంపేట్: సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్ 191 కాలనీలో 16 సీసీ టీవీ కెమెరాలను శనివారం రాత్రి ప్రారంభించారు. కమ్యూనిటీ కెమెరాల్లో భాగంగా ఆలయంతో పాటు నిర్మానుష్య ప్రాంతంలో వీటిని ఏర్పాటు చేసినట్లు సీఐ జె.ఉపేందర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రక్షణ నిధికి రూ.10 లక్షల విరాళం

కూకట్‌పల్లి: పాకిస్తాన్‌పై భారత్ చేస్తున్న ధర్మ యుద్ధానికి మద్దతు తెలుపుతూ సైనికులకు అండగా ఉండేందుకు తమవంతుగా రూ.10 లక్షలను జాతీయ రక్షణ నిధికి అందిస్తున్నట్లు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమార్తె శ్రీలత, కుమారుడు సందీప్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కుటుంబాలు, బంధాలు, బంధుత్వాలను త్యాగం చేసి మనల్ని రక్షిస్తున్న సైనికులకు మనం ఎంత ఇచ్చినా రుణం తీర్చుకోలేమని, ఈ సమయంలో దేశ ప్రతి పౌరుడు కూడా సైనికులకు, దేశానికి అండగా నిలవాలని కోరారు. అలాగే ‘ఆపరేషన్ సిందూర్’ విజయవంతం కావాలని ఉగ్రవాద రూపురేఖలు సమసిపోయి, దేశం సుభిక్షంగా, శాంతిగా ఉండాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు.

తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నెల వేతనం..

మోతీనగర్: ఉగ్రవాద నిర్మూలణకు మన సైన్యం చేసే ప్రయత్నాలకు మద్దతుగా తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ ఒక నెల జీతాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైన్యం ‘ఆపరేషన్ సిందూర్’ పేరిట ఉగ్రవాదుల నిర్మూలనకు చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా జాతీయ రక్షణ నిధికి, సైన్యానికి ప్రతిఒక్కరూ మద్దతుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

అమరవీరులకు ఘన నివాళి

కూకట్‌పల్లి: ‘ఆపరేషన్ సిందూర్’లో భాగంగా ఇండియా, పాకిస్తాన్ యుద్ధంలో అమరులైన భారత జవాన్లకు కేపీహెచ్‌బీకాలనీలోని మహాత్మగాంధీ విగ్రహం వద్ద జర్నలిస్ట్ సంఘాల నాయకులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్, ఏజేయూ నాయకుడు విద్యా వెంకట్, జర్నలిస్టు నాయకులు తొట్ల పరమేశ్, ఆర్.కె. దయాసాగర్, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాణిక్ రెడ్డి, రాహుల్, నాగరాజు, ప్రవీణ్, జై కుమార్, సాగర్ రెడ్డి, రాము, నవీన్, రమేశ్, రాకేశ్, కుల్ల రాజు, నరసింహారావు, వెంకటేశ్, రామారావు, హరికృష్ణ, మారుతీ సాగర్, పలు పార్టీల నాయకులు వెంకట్‌రెడ్డి, శివారెడ్డి, జొన్నల శ్రీనివాస్ రెడ్డి, వెంకటస్వామి, విద్యార్థి సంఘాల నాయకులు దిలీప్, అశోక్ గౌడ్, భిక్షపతి పాల్గొన్నారు.